


## అమెరికామెడి కబుర్లు- 15

### బాబోయ్, అంకుల్ శ్యాం....

చెప్పొద్దూ, నాకు ఏప్రిల్ నెల వస్తుంది అని మార్చి నెలలో అనిపించగానే అంటే భలే భయమూ, దడా, కంపరమూ మొదలైనవి టప, టపా వస్తాయి. ఎందుకంటే, ఏప్రిల్ ఒకటో తారీకునుంచీ నెలాఖరు దాకా గత అనేక సంవత్సరాలుగా నేను "ఫూల్" అవుతానని, అయ్యాననీ నాకు స్వానుభవరీత్యా బాగా తెలుసు. ఏప్రిలూ, ఫూలూ లాటి మాటలు ముందే తెలిసుంటే, అసలు ఏప్రిల్ లో పుట్టకపోదును. ఏప్రిల్ లో పెళ్ళి చేసుకోక పోదును. ఏప్రిల్లో హ్యూస్టన్ రాకపోదును.

పైగా, నా జాతక మహిమ ఏమిటో తెలియదు కానీ, ప్రతీ ఏప్రిల్ నెలలోనూ మొదలు పెట్టి మళ్ళీ ఏప్రిల్ దాకా అందరి చేతా అడ్డమైన చివాట్లూ తింటూ ఉంటాను. ఉదాహరణకి, ఈ ఏడు ఏప్రిల్ మొదటి వారంలో నాకు ఒక ఆకాశవాణి ఉత్తరం వచ్చింది. అందులో సారాంశం ఏమిటంటే "మీలాటి బూజు పట్టిన రచయితల చెత్త రచనలని బుట్టలో పారెయ్యకుండా, జాగ్రత్తగా మా కాకినాడ, రాజమండ్రి సంఘాలకి పంపుతున్నాను, తగిన విధంగా "సన్మానించమని" కోరుతూ. మీ తప్పు మీరు తెల్సుకున్నారనుకొంటా." ఈ ఉత్తరం అందగానే బూజులు దులిపే డాక్టర్ దగ్గరకి వెళ్ళి శల్య పరీక్ష చేయించుకుని, నాకు సన్మానం ఏర్పాట్లు చేయిస్తున్నానని ఈ పెద్ద మనిషి హామీ ఇచ్చారు కాబట్టి అర్జంటుగా కాకినాడ, రాజమండ్రిలకి టిక్కెట్లు కావలెను అని మా ట్రావెల్ ఏజెంట్ గారికి విన్నపం పంపించాను. ఎందుకైనా మంచిదని ఆ ప్రాంతాలలో నాకు తెలిసిన కొందరికి కనీసం ఐదారుగురు బాడీ గార్డులని కూడా ఏర్పాటు చేయమని వర్తమానం పంపించాను. ఎందుకంటే ఈ సన్మానం ఏ టైపో తెలియదు కదా! "సన్మానం" అనే మాటకి "దేహశుద్ధి" అనే అర్థం కూడా ఉంది కదా!.

ఇవన్నీ ఎలా ఉన్నా, అసలు విషయం ఏమిటంటే, ఏప్రిల్ నెలరాగానే అమెరికా లో పదిహేనో తారీకు కల్లా ఆదాయం పన్ను ...అనగా ఇన్కం టాక్స్ రిటర్న్ అందరూ అంకుల్ శ్యాం గారికి, సమర్పించాలి. ఈ ఇన్కంటాక్స్ అసలు ఎందుకు కట్టాలో ఎవరికీ తెలియదు. ఎంతకట్టాలో అంతకంటా తెలియదు. ఇదే ఇండియాలో అయితే ఇన్కమూ లేదు, టాక్సూ లేదు. ఒక వేళ ఉన్నా, బల్ల కింద మదుపు పెడితే కేంద్ర ప్రభుత్వమూ, రాష్ట్ర ప్రభుత్వము వారూ, మా కరణం గారూ అందరూ ఆనందించి " పోదురూ, సదువుకున్నోళ్ళు, తమరు పన్ను కట్టడం ఏమిటీ?, సెండాలం కదా సారూ." అని మనల్ని మర్యాద చేసి, వాళ్ళే అన్ని కాగితాలూ..అంటే ఫారాలు పూర్తి చేసి ఏదో ఫార్మాలిటీ కోసం సంతకాలకి మన ఇంటికి వాళ్ళే సైకిలేసుకుని వస్తారు. అదయినా నిజయితీగా ఉండాలని మన సంతకం ఫోర్జరీ చెయ్యకుండా.

అమెరికాలో అందరికీ ఉన్న సమస్య ఏమిటంటే, అంకుల్ శ్యాం గారికి నయాపైసా కూడా ఆదాయం పన్ను కట్టకుండా అమెరికా ప్రభుత్వాన్ని ఎలా దివాళా తీయించాలా అని. ఈ జార్జ్ గారు పోయి మరొక హిలరీ గారో, ఒబామా గారో, జాన్ గారో పదవిలోకి వచ్చినా, అంకుల్ గారు ఎక్కడికీ పోరు కాబట్టి ఈ సమస్య ఎల్లప్పుడూ అందరికీ ఉంటుంది. నా మటుకు నాకు కాస్తో, కూస్తో ఇన్కంటాక్స్ కడదామని కోరిక ఉన్నా, కాణీ కూడా ఆదాయం లేని బీద వాళ్ళ దగ్గర అమెరికా ప్రభుత్వం వారు పన్ను వసూలు చెయ్యరు. ఆ మాటకొస్తే, తిండీ తిప్పలూ లేకుండా మాడి చచ్చుదురేమో, ఆ పాపము మనకేల అని తిండి ఖర్చులకి సరిపడా డాలర్లు ఇచ్చి స్వర్గానికి నిచ్చెనలు వేసుకుంటారు. అదే మన పవిత్ర భారత దేశంలో పరిస్థితి చూడాలంటే ఏదైనా దేవాలయం మెట్ల దగ్గర చూడండి. డైరెక్టుగా దేవుడే డబ్బులు ఇప్పిస్తాడు భక్తుల దగ్గరనుంచి, ఈ గవర్నమెంటు బెడద లేకుండా.

అమెరికాలో మరొక సదుపాయం ఉంది. ఆదాయం ఉన్న వాళ్ళకి పన్ను ఎగ్గొట్టడానికి అమెరికా గవర్నమెంటే అనేక సదుపాయాలు కలిగిస్తుంది. వాటిని అంతకంటే ఖచ్చితంగా అమలుపరచడానికి ఎకౌంటెట్స్ అనే జాతిని కూడా ఏర్పాటు చేశారు. వీళ్ళని సీపీయేలు, బుక్ కీపరూ, టాక్స్ ప్రిపేరరూ, మొదలైన తమాషా పేర్లతో ఆప్యాయంగా పిలుస్తారు. గంటకి ఐదు వందల డాలర్లు పుచ్చుకునే వారు సీపీయేలు అనమాట. అదే టూకీగా కంప్యూటర్ లో అరగంటలో మీ టాక్స్ రిటర్న్ తయారు చేసేసి వంద డాలర్లు జేబులో వేసుకుని ఆనందపడేవారు ప్రిపేరర్లు అనమాట. మరొక రకం వారు మార్చి, ఏప్రిల్ నెలలలో దుకాణాలు తెరిచి, మీకు వెనక్కి తిరిగివచ్చే రిఫండ్లో సగం డబ్బులు మీకు ముందే ఇచ్చేసి, మిగతా డబ్బు వాళ్ళ సొంత ఎకౌంట్లో వేసుకుంటారు. వీళ్ళ ప్రత్యేకతకి గుర్తింపుగా అటువంటి వారిని "ఫ్లై బై నైట్" టాక్స్ కంపెనీ వారు అంటారు.

ఈ ఎకౌంటెట్స్ జాతి వారందరూ, వారి దగ్గరికి వచ్చేవారిని బట్టి పరి పరి విధాలుగా ఉంటారు. ఉదాహరణకి, నేను ఫలానా రోజున వంకాయలు కొనుక్కోడానికి విమానంలో న్యూయార్కు వెళ్ళాను కదా, ఆ ఖర్చులు ఆదాయం పన్నులో మిగుల్చుకోవచ్చునా అని మీరు అడిగారు అనుకోండి. నిజానికి మీరు మీ మిత్రుడి అమ్మాయికి జరుగుతున్న టెలెగూ-పంజాబీ పెళ్ళికి వెళ్ళారు అన్న సంగతి అంకుల్ గారికి తెలియదు కదా! సీపీయే గారు అయితే "ఈ వంకాయలు నీ వ్యాపారంలో సగ భాగం అయితే సగం ఖర్చు, అంటే నూయార్క్ వెళ్ళే ఖర్చు డిడక్ట్ చేసుకోవచ్చు కానీ, వెనక్కి తిరిగి రాలేవు. పైగా నువ్వు కొన్న వంకాయలలో పుచ్చువి ఎంత శాతం ఉంటాయో అనే విషయాన్ని కూడా కూలంకషంగా పరిశీలించాలి. ఆ పరిశోధనకి మహా అయితే గంట పడుతుంది. అంతే కాదు, మంచి వంకాయలు కూడా త్వరలో కుళ్ళిపోయే అవకాశం ఉంది కాబట్టి, వాటికి డిప్రిసియేషన్ కూడా తీసుకోవచ్చు. అది డిసైడ్ చెయ్యడానికి మరొక గంట చాలు" అని సమాధానం చెప్తారు.

అదే రెండు నెలల పాటు దుకాణం తెరిచిన "ఫ్లై బై నైట్" టాక్స్ కంపెనీ వారు అయితే ముందు డిడక్ట్ చేసి పారేద్దాం. ఎందుకంటే, కుక్క పిల్ల, దాని సబ్బు బిళ్ళా, కాదేదీ డిడక్షన్ కి అనర్హం అని మహా కవి ఏనాడో చెప్పాడు కాబట్టి మనం ఏడాది పొడుగునా కట్టిన టాక్స్ డబ్బంతా వెనక్కి వచ్చేస్తుంది. జార్జ్ బుష్ గారు ఇరాక్ యుద్ధంలో చావు దెబ్బలు తింటూ బిజీగా ఉన్నారు కదా ! మన వంకాయల వ్యాపారమూ, అందు వచ్చు నష్టాలూ ఆయన ఇప్పుడప్పుడే పట్టించుకోడు" అని సలహా ఇస్తాడు. వెనక్కి తిరిగి వచ్చిన టాక్స్ రిఫండ్ సగం వారి బేంక్ లో పడగానే సదరు "ఫ్లై బై నైట్" గారు ఈ సువిశాల ప్రపంచంలోకి మాయమయిపోతారు. ఐదేళ్ళ తరవాత ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ వారు ..అనగా టాక్స్ డిపార్ట్మెంట్ వారు ఆ వంకాయలు, కుక్క పిల్లా ఎక్కడ ఉన్నాయో చూపించమని మనల్ని తగులుకుంటారు. అఫ్ కోర్స్, నేను బ్రిలియంట్ ఫెలో ని కదా! అందుచేత మా క్వీన్ విక్టోరియాకి తెలియకుండా ఆ గుత్తి వంకాయ కూర కొంతా, సబ్బు బిళ్ళ కొంతా ఫ్రీజర్ లో దాచాను. మా కుక్క పిల్ల మటుకు గుటుక్కు మంది. మరి ఏం చెయ్యనూ?

పోనీ సొంతంగా ఈ టాక్స్ రిటర్న్ తయారు చేసుకుందాములే అనుకున్నామనుకోండి. అదొక న్యూసెన్సు. ఎందుకంటే, నేను వాడే కంప్యూటర్ ప్రోగ్రాములో చచ్చు ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పి తీరాలి. లేక పోతే ముందుకి వెళ్ళలేం. ఉదాహరణకి, " నువ్వు నీ మొదటి భార్య, లేదా భర్తకి మనోవర్తి ఎంత ఇస్తావూ? అనే ప్రశ్న వచ్చిందనుకోండి. మనకి భలే కోపం వస్తుంది కదా!. బహుశా పొరపాటునే అనుకోండి, నాబోటి గాడికి ఒకే ఒక సారి పెళ్ళి అవడమే గగనం కాబట్టి వాళ్ళు నన్ను ఇలా రెచ్చగొట్టడం ఏమన్నా బావుందా? పైగా ఈ తరహా ప్రశ్నలకి నేను ఏం సమాధానం రాస్తానో చూద్దామని మా క్వీన్ గారు నా పక్కనే కుర్చీ వేసుకుని కూచుంటే, నా బుర్ర మామూలు కంటే ఎక్కువగా బంకమట్టితో నిండిపోతుంది.

మన వాళ్ళందరికీ మరొక ప్రధానమైన సమస్య మరొకటి ఉంది. ఒకసారి ఒక మిత్రుడు నన్ను "గురూ, ఈ ఏడు మా అత్తగారూ, మామగారూ ఇండియానుంచి వచ్చారు. మా పిల్లలకి బేబీ సిట్టింగ్ చేసినందుకు మా అత్తగారికి నెలకి వెయ్యి డాలర్లూ, మా మామగారిని కూడా బేబీ సిట్టింగ్ చేసినందుకు ఆవిడకి నెలకి యాభై డాలర్లూ, వాళ్ళ ప్రయాణం ఖర్చులూ అన్నీ కలిపి పాతిక వేలు దాటాయి. ఆ ఖర్చు డిడక్ట్ చేసుకోవచ్చునా?" అని సలహా అడిగాడు. "తప్పు కాదూ? మీ పిల్లల బేబీ సిట్టింగ్ అయితే వెయ్యి డాలర్లు ఇచ్చి, మామగారిని ప్రేమగా చూసుకున్నందుకు ముష్టి యాభై డాలర్లు ఇస్తావా? ఆయన ఏమన్నా అనుకోరూ?" అని కోప్పడ్డాను. చెప్పొద్దూ, వాడు నన్ను వెర్రి వెధవని చూసినట్టు చూశాడు. అతన్ని కిందటి ఏడాది ఏప్రిల్లో చూశాను.

అందుకే ప్రతీ ఉగాది సమయంలోనూ, అంటే మార్చ్-ఏప్రిల్ ప్రాంతాలలో అనమాట, అందరూ కవి సమ్మేళనాలు జరుపుకుంటూ ఉంటే నా కవితలో మటుకు ప్రతీ ఏడూ మూడే పాదాలు.

నాకు ఏప్రిల్ అనగానే భయం
అడుగడుగో బాబోయ్ అంకుల్ శ్యాం
అవుతుందేమో నా టాక్స్ రిటర్న్ భశుం

❀❀❀